ప్రసన్న రత్నాకర్ ఫౌండేషన్ చేయూత

విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలో గత 8 సంవత్సరాల క్రితం స్థాపించబడిన స్వర్గీయ జిల్లా పరిషత్ చైర్పర్సన్ ప్రసన్న రత్నాకర్ ఫౌండేషన్ ద్వారా రామన్నపేట మండలంలోని ఎంతో మంది బీద విద్యార్థులకు, ఆనారోగ్యానికి గురైన కార్యకర్తలకు ప్రసన్న రత్నాకర్ ఫౌండేషన్ ద్వారా సంస్థ చైర్మన్ వేమవరం సుధీర్ బాబు వివిధ రకాలుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అ కార్యక్రమాలలో భాగంగా గురువారం రోజు రామన్నపేట మండల కేంద్రానికి చెందిన గొర్ల నాగరాజు, నకిరేకంటి గోపాల్ ఆనారోగ్యానికి గురి కావడంతో వారి కుటుంబాలను ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి 8,000/రూపాయలు ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మిర్యాల మల్లేష్ మాట్లాడుతు స్వర్గీయ ప్రసన్న రత్నాకర్ ఆశయాలను కొనసాగిస్తామని ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు ఇంకా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బొడ్డు అల్లయ్య, గాదె రాము, బాసాని రాజు, చిత్రకంటి శివశంకర్, చిత్రకంటి బద్రీనాథ్, బాణాల ప్రమోద్, బాసాని సతీష్, మనిమద్దె మధు, బొడ్డు నవీన్, గొర్ల సాయి, గొర్ల నర్సింగ్ రావు, సనికొమ్ము ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

విశ్వంభర, సూర్యాపేట: అంతర్జాతీయ 11వ యోగ ఉత్సవాల సందర్భంగా రూపొందించిన పోస్టర్ను కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ గురువారం రాత్రి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో డిఎంహెచ్వో తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజు యోగ, ధ్యానంతో మానసిక ప్రశాంతత ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడంతో పాటు ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. ఈ నెల 21వ తేదీన సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రజలు జిల్లా అధికారులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో చంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నునావత్ కుమార్ ,డాక్టర్ బి రామకృష్ణ ,డాక్టర్ విజయ సారథి, డాక్టర్ రాంప్రసాద్, యోగ శిక్షకులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంః ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

విశ్వంభర, దేవరకద్ర : మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలోని కౌకుంట్ల మండలంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు దేవరకద్ర నియోజకవర్గానికి 3,500 ఇండ్లు,కౌకుంట్ల మండలంలో,78 లక్షలతో ఆసుపత్రి,శివాలయ పునర్నిర్మాణానికి 40 లక్షలు, కురుమూర్తి దేవస్థానానికి ఘాటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల నుండి ఎలాంటి అభివృద్ధి చేయలేదని స్వలాభం చూసుకొని కుటుంబం మాత్రమే బాగు పడిందని చెప్పుకొచ్చారు. ప్రతి నిరుపేద కల ఇంటి సహకారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే నెరవేర్చిందని నెరవేరుస్తుందని ఇందిరమ్మ ఇండ్లు సహకారంతో ప్రజల కళ్ళల్లో ఆనందాన్ని చూస్తున్నామని చెప్పుకొచ్చారు.దాదాపుగా ఈ మండలంలో ఇప్పటికీ 236 ఇళ్ల ప్రొసీడింగ్స్ ఇచ్చామని ఇప్పుడు కొందరు ఇండ్లు పూర్తి చేసుకున్నారని, ఇండ్లు రానివారికి త్వరలోనే విడతల వారిగా ఇస్తూ ఉంటామని తెలిపారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విశ్వంభర, మహాదేవపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ ,విశ్వకర్మలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం జిల్లా అధ్యక్షులు ఆకునూరి సతీష్ చారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చి విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు కుల వృత్తులు రోజు రోజుకు నిరాధరణకు గురి కావడంతో విశ్వకర్మలు దిక్కు తోచని స్థితిలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వృత్తుల లేక బ్రతుకులు భారమై కుటుంబాలను నెట్టుకొస్తున్న విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకొని యాభై సంవత్సరాలు నిండినవారికి రూ 5 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. . నియోజకవర్గ కేంద్రంలో 20ఎకరాల స్థలం కేటాయించి, వృత్తి శిక్షణ, వృత్తి చేసుకోవడానికి చిన్నతరహా పరిశ్రమల రూపంలో పంచవృత్తులు ఒకే చోట నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వ కార్యాలయాలల్లో నిర్వహించే కార్పెంటరీ పనులను గుత్తే దారులకు కాకుండా విశ్వబ్రాహ్మణులకే అప్పగించాలని కోరారు. విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిసి వివరించనున్నట్లు ఆయన తెలిపారు.

ఫార్మాస్యూటికల్ పరిశోధనలో డాక్టర్ మజుందర్‌కు పీహెచ్డీ



విశ్వంభర, సంగారెడ్డిః సంగారెడ్డి జిల్లా ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని తాంద్రిమా మజుందర్ ను డాక్టరేట్ వరించింది. జంతువులలో ఫార్మకోకైనటిక్ అధ్యయనాలకు అనువర్తనాలతో, ఎల్సీఎంఎస్/ఎంఎస్, యూపీఎల్సీ ఉపయోగించి ఎంచుకున్న ఔషధాల బయోఅనలిటికల్ పద్ధతి అభివృద్ధి, ధ్రువీకరణపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివ కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ మజుందర్ అధ్యయనం ఔషధ విశ్లేషణలో కీలకమైన సవాళ్లను పరిష్కరిస్తుందని, ఔషధ సమ్మేళనాల అంచనాలో ఖచ్చితత్వం, నిర్దిష్టత, సున్నితత్వం, ఖర్చుప్రభావిత అవసరాన్ని నొక్కి చెబుతుందన్నారు.

ఆమె పరిశోధన ఎల్సీఎంఎస్/ఎంఎస్ ఉపయోగించి మానవ ప్లాస్మా నుంచి ఆల్పెలిసిబ్, రెమోగ్లిఫ్లోజిన్, మెట్ఫార్మిన్ యొక్క బయోఅనలిటికల్ క్వాంటిఫికేషన్ తో పాటు యూపీఎల్సీ ఉపయోగించి డోరావైరిన్ కోసం స్థిరత్వాన్ని సూచించే పద్ధతిని అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. ఎఫ్.డీ.ఏ., ఐ.సీ.హెచ్. మార్గదర్శకాలకు అనుగుణంగా ధ్రువీకరించిన పద్ధతులు, కుందేలు ప్లాస్మాలోని ఫార్మకోకైనెటిక్ అధ్యయనాలకు విజయవంతంగా వర్తింపజేశామన్నారు. అధిక ఖచ్చితత్వం, ఎంపిక, పునరుద్దరణను ప్రదర్శిస్తాయని, ఇవి ఫార్మకోకైనెటిక్, బయోఈక్వివలెన్స్ అధ్యయనాలకు అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు డాక్టర్ తాంద్రిమా మజుందర్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై

చంద్రబాబు, రేవంత్ సహా ప్రముఖుల దిగ్భ్రాంతి

విశ్వంభర, హైదరాబాద్ : అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై తెలుగు రాష్ట్రాల సీఎంలతో పాటు పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుజరాత్ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఏఐ171 విమానం కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో దానిలో 242 మంది ప్రయాణికులు ఉన్నారు.

విమాన ప్రమాదం దిగ్భ్రాంతికి గురిచేసింది: ఏపీ సీఎంచంద్రబాబు

అహ్మదాబాద్ విమాన ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రార్థిస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సహాయక చర్యలు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన విమానం ప్రమాదానికి గురవడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయక చర్యలు వేగవంతం చేయాలని కోరారు.

ఘోర విమాన ప్రమాదంపై కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై భారాస అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సామాన్యులు సహా వైద్య విద్యార్థులు మరణించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉండాలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

"అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది కోసం ప్రార్థిస్తున్నాను. ప్రమాద ఘటనపై అధికారిక సమాచారం కోసం ఎదురు చూస్తున్నాం. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అందరూ అండగా ఉండాలి. ఈ ఆందోళనకరమైన సమయంలో అందరి మద్దతు వారికి బలం చేకూరుస్తుందని ఆశిస్తున్నా" అని పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

దిగ్భ్రాంతికి గురి చేసింది: మంత్రి నారా లోకేశ్

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. సహాయ చర్యలు వేగంగా జరగాలని కోరుకుంటున్నా అని లోకేశ్ ట్వీట్ చేశారు.

పక్షులు ఢీకొట్టడమే.. విమాన ప్రమాదానికి కారణమా?

విశ్వంభర, నేషనల్ బ్యూరోః విమాన ప్రమాదాలకు సాంకేతిక వైఫల్యాలు ఓ కారణమైతే పక్షులు కూడా కొన్ని సందర్భాల్లో ప్రమాదకరంగా మారుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే ఘోర ప్రమాదానికి గురయ్యింది . ఇందుకు స్పష్టమైన కారణం తెలియనప్పటికీ.. పక్షులు ఢీకొట్టడం వల్ల విమానం నిర్దిష్ట వేగాన్ని అందుకోలేకపోయి ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు. దీని వల్ల ప్రమాదం సంభవించే అవకాశాలను తోసిపుచ్చలేమని చెబుతున్నారు.సీనియర్ పైలట్ సౌరభ్ భట్నాగర్ ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. "ఘటనను బట్టి చూస్తే అనేక పక్షులు ఢీకొట్టడంతో విమానం రెండు ఇంజిన్లు శక్తికి కోల్పోయి ఉండొచ్చని ప్రాథమికంగా కనిపిస్తోంది. టేకాఫ్ సరిగా కాలేదు. పైకి వెళ్లాల్సిన విమానం ఒక్కసారిగా కిందకు దిగినట్లు ఫుటేజీలో కనిపించింది. పైలట్ వెంటనే మేడే కాల్ ఇచ్చారు. ఇంజిన్ శక్తి కోల్పోవడం లేదా విమానం పైకి ఎగరలేకపోయిన సందర్భంలోనే ఇలా జరుగుతుంది. ఏదేమైనా కచ్చితమైన కారణం మాత్రం దర్యాప్తులోనే తేలుతుంది'' అని పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన విమానం కొత్తదేనని (కేవలం 11 ఏళ్లు), అందుకే ప్రమాదానికి సాంకేతిక సమస్య కారణం కాకపోయి ఉండవచ్చని విమానయాన నిపుణుడు సంజయ్ లాజర్ పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు పక్కనే నివాస స్థలం కావడం, ఆ ప్రాంతంలో పక్షులు ఉండే అవకాశం ఉందన్నారు. అయితే, ప్రమాదానికి ఇది కూడా ఓ కారణం అయి ఉండే అవకాశం ఉన్నప్పటికీ.. అసలు వాస్తవాలన్నీ దర్యాప్తులోనే బయటపడతాయని అన్నారు.అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ ప్రకారం విమానాలను పక్షి ఢీకొట్టే ఘటనల్లో 92శాతం అంతగా ప్రమాదం లేదని లేనప్పటికీ.. మిగతా 8శాతం మాత్రం తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నట్లు అంచనా. ముఖ్యంగా ఇంజిన్‌లోకి పక్షులు కూరుకుపోయిన సందర్భాల్లో పరిస్థితులు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. మరికొన్ని పరిస్థితుల్లో పక్షులు లేదా రాబందుల వల్ల విమానాలు అత్యవసర ల్యాండింగ్‌లకు దారితీస్తున్నాయి.ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం.. ప్రమాదానికి ముందు విమానం కేవలం 625 అడుగుల ఎత్తువరకే వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే, సుదూర ప్రయాణానికి వెళ్లే ఆ విమానంలో ఇంధనం కూడా భారీగానే ఉంటుంది. ప్రమాదానికి ముందు విమాన దృశ్యాలను చూస్తుంటే.. ఎత్తుకు వెళ్లేందుకు బదులుగా విమానం వేగంగా నేల వైపు దూసుకెళ్లింది. ఇలా భారీ పరిమాణం, బరువు ఉన్న విమానం ఆ ఎత్తులో సిగ్నల్ కోల్పోవడం అత్యంత ప్రమాదకరమేనని నిపుణులు చెబుతున్నారు.

టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం

విశ్వంభర, షాద్ నగర్ : బుధవారం రంగారెడ్డి జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు ఆదేశానుసారం, షాద్ నగర్ డివిజన్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బూర్గుల ఏరియా, సబ్ సెంటర్ అన్నారు గ్రామంలో , డాక్టర్ రాఘవేందర్ ఆధ్వర్యంలో టీ.బీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ టి.బి అనేది మైకో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ అనే సూక్ష్మ క్రిమి వలన వ్యాపిస్తుందని చెప్పారు. టీ.బి రోగము ఉన్నవాళ్లు దగ్గినప్పుడు , తుమ్మినప్పుడు వారి యొక్క తుంపర్ల ద్వారా గాలిలో వ్యాప్తి చెంది ఇతరులకు టీ.బీ వ్యాధి వస్తుందని తెలియజేశారు. టి .బి.లక్షణాలు రెండు వారాలకు మించి దగ్గు , జ్వరము ఉండడం.రాత్రిపూట చెమటలు పట్టడం.ఆకలి మరియు బరువు తగ్గటం.చాతిలో నొప్పి, దగ్గినప్పుడు రక్తం పడటం. ఈ లక్షణాలు ఉన్న వారందరూ కూడా గల్ల పరీక్ష,ఎక్స్ రే పరీక్ష చేయించుకున్నట్లయితే టిబి వ్యాధి ఉన్నది లేనిది తెలుస్తుంది అని జె. శ్రీనివాసులు తెలియజేశారు. పై లక్షణాలు ఉన్నవారు గల్ల పరీక్ష,ఎక్స్ రే పరీక్షలు ఉచితంగా ప్రభుత్వాసుపత్రిలో చేస్తారని చెప్పారు.ఎవరికైనా టీ.బీ ఉందని పరీక్షలో తేలినట్లయితే వారికి ప్రభుత్వమే దాదాపు 8 వేల రూపాయల విలువ గల మందులు ప్రభుత్వము వారు ఉచితంగా ఇస్తారని, ఆ మందులు రెగ్యులర్ గా 6 నెలలు మింగినట్లయితే టి. బి వ్యాధి తప్పకుండా నయమవుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. అలాగే ప్రభుత్వము టీ.బీ రోగం ఉన్నవారికి , ప్రభుత్వము వారు మంచి పోషకాహారము తీసుకోవాలని ఉద్దేశముతో పేషెంట్ యొక్క ఖాతాలో ప్రతినెలా 1000 రూపాయలు వేస్తారని చెప్పారు. ఈ 1000 రూపాయలతో పేషెంట్ వారు బియ్యం, పప్పు దినుసులు, గుడ్లు, పాలు మరియు తాజా కూరగాయలు కొనుక్కోవడానికి ఉపయోగించాలని చెప్పారు. టీ.బీ రోగస్తులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి, క్రమం తప్పకుండా మందులు కచ్చితంగా వాడాలి అని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. ఈ టీ.బి ముక్త భారత్ అభియాన్ ప్రోగ్రాంలో ఈరోజు 152 మందికి ఓ.పి చూడడం జరిగిందని , 64 మంది కి టీ.బీ సస్పెక్టెడ్ కేసులుగా గుర్తించి వారిలో 36 మందికి గళ్ళ పరీక్షలు ట్రూ నాట్ మిషన్ ద్వారా చేయడం జరిగిందని మరియు 15 మందికి ఎక్స్ రే పరీక్షలు కూడా చేయించడం జరిగిందని జె.శ్రీనివాసులు తెలియజేశారు.అలాగే అక్కడకు వచ్చిన వారికి హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ గురించి వ్యాధి ఎలా వస్తుంది ఏ విధంగా వ్యాపిస్తుంది అని, ఎయిడ్స్ రాకుండా ఉండాలి అంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా తెలియజేశారు. డాక్టర్ రాఘవేందర్ మాట్లాడుతూ టీ.బీ లక్షణాలు ఉన్న వారందరూ కూడా తప్పకుండా గల్ల పరీక్ష మరియు ఎక్స్రే పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వం ఇచ్చే ఖరీదైన ఉచిత మందులు వాడినట్లయితే టీ. బి తప్పకుండా నయం అవుతుందని తెలియజేశారు. అలాగే మీ గ్రామంలో ప్రతిరోజు ఎం ఎల్ హెచ్ పి వైద్యాధికారి డాక్టర్ శ్రీ లలిత వస్తారు వీరితో బీపీ మరియు షుగరు పరీక్షలు చేయించుకొని తగిన మాత్రలు తీసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బూర్గుల డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ జయ ప్రకాష్ , ఎం ఎల్ హెచ్ పి డాక్టర్ శ్రీ లలిత, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, పిహెచ్ఎన్ మహేశ్వరి, ఎం పి హెచ్ ఈ ఓ శ్రావణ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ అమృత, టి.బి సూపర్వైజర్లు షఫీ మరియు రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ వెంకట ముని, ఐ సి టి సి సెంటర్ శ్యాంసుందర్, మల్లేష్ ,హెల్త్ అసిస్టెంట్ రెడ్యానాయక్, ఏఎన్ఎం నిర్మల మరియు ఆశలు పాల్గొన్నారు.

గిర్ని తండాలో అంగన్వాడి బడిబాట

విశ్వంభర, కేసముద్రం : కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని గిర్ని తండా అంగన్వాడి సెంటర్ నందు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాలను బలోపేతం లక్ష్యంగా ప్రభుత్వం అమ్మ మాట అంగన్వాడి బాట అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది రెండున్నర సంవత్సరాల వయసు గల పిల్లలను గుర్తించడం అంగన్వాడి వ్యవస్థ ద్వారా నిర్వహించే కార్యక్రమాలను తెలియడంతో పాటు ప్రీ స్కూల్ ప్రాధాన్యత వివరిస్తారు ఈ కార్యక్రమం నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్కులర్ జారీ చేశారు కార్యక్రమం లో భాగంగా ముందుగానే అంగన్వాడి కేంద్రాలను అలంకరించాలని ఆదేశించారు తల్లిదండ్రులకు, పిల్లలకు, స్వాగతం పలికి సెల్ఫీలు తీసుకోవాలని. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించాలి ఇండ్ల సందర్శన, పిల్లలను కేంద్రాలు చేర్పించడం ప్రీస్కూల్ పూర్తి చేసిన పిల్లలకు సర్టిఫికెట్ ఇవ్వాలి ఐదు సంవత్సరాల పైబడిన వారిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని దీని ఉద్దేశం ఈ కార్యక్రమంలో టీచర్ రమాదేవి కవిత హెల్పర్ వెంకటలక్ష్మి కవిత. విజయ, రాధ, భార్గవి, అంజలి పాల్గొన్నారు.

తెలంగాణలో రజాకారుల పాలన

వీహెచ్‌పీ పోరాటానికి దళిత సంఘాల మద్దతు



విశ్వంభర, హైదరాబాద్ః తెలంగాణ రాష్ట్రంలో రజాకారుల పరిపాలన కొనసాగుతున్నదని విశ్వహిందూ పరిషత్ ఆరోపించింది. హిందూ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం మజిలీస్ పార్టీ ఎజెండాను అమలు చేస్తుందని విమర్శించింది. మజిలీస్ పార్టీ మెప్పు పొందేందుకు ఇందిరమ్మ రాజ్యంలో హిందువులపై ఘోరమైన దాడి జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ముక్కోటి దేవతలకు నిలయమైన గోవును రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టింది. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విశ్వహిందూ పరిషత్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ లో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదని.. హిందూ వ్యతిరేక పాలన అన్నారు. ఇటీవల బక్రీద్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అవలంబించిన తీరు హిందూ మనోభావాలను గాయపరిచిందన్నారు. గో రక్షణ కోసం ఏర్పాటుచేసిన చెక్ పోస్టులు విఫలమయ్యాయని ఆరోపించారు. పట్టుకున్న గోవుల జాడలేదని, ఎన్ని పట్టుకున్నారు..? వాటిని ఎక్కడ ఉంచారు ..? గో రక్షణ కోసం చేసిన ప్రయత్నాలు, సమీక్షలు, వాటి వివరాలు ఎవరి దగ్గర ఉన్నాయో ఇప్పటికీ ప్రభుత్వం చెప్పడం లేదన్నారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్స్ దగ్గర ఎన్ని ఆవులు ఉన్నాయో లెక్కలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, గోరక్షకులపై ముస్లింలు అత్యంత దారుణంగా దాడులు చేసినప్పటికీ పోలీసు యంత్రాంగం బాధితులపైనే కేసులు నమోదు చేసిందన్నారు. కొన్నిస్థలాల్లో సబ్ ఇన్స్పెక్టర్, ఇతర కానిస్టేబుల్స్ పై గోహంతకులు దాడి చేసినప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. పైగా గోరక్షకులపైనే చట్ట విరుద్ధంగా కేసులు నమోదు చేసిందని అధికార యంత్రాంగాన్ని తప్పు పట్టారు.భాగ్యనగరంలోని మైలార్ దేవుపల్లి, ముషీరాబాద్, రామంతపూర్, తదితర ప్రదేశాలలో గో హంతకులు చట్టాన్ని చేతులకు తీసుకొని, హిందువులను చంపే ప్రయత్నం చేశారన్నారు. బక్రీద్ సందర్భంగా వధించిన గోవు వ్యర్థాలను రక్త మాంసాలను బహిరంగంగా ప్రదర్శిస్తూ.. హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిన సంఘటనలపై తెలంగాణ ప్రభుత్వం పోలీసు యంత్రాంగం నిర్లజ్జగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. భాగ్యనగరం తో పాటు సిద్దిపేట, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గోవు ప్రేమికులైన దళితులపై దాడి చేసి తీవ్రంగా హింసించారన్నారు. దళితులు, పేదలపై పోలీసులు వ్యవహరించిన తీరు రాజ్యాంగ విరుద్ధమన్నారు. మైలార్ దేవుపల్లి లో ఇళ్లలోకి చొరబడి భార్యాభర్తలను వేధించడం, తమ పిల్లల జాడ చెప్పాలని సెల్ ఫోన్ చాటింగ్ వెతకడం, చేతులకు బేడీలు వేయడం అత్యంత అమానవీయమని పేర్కొన్నారు. ఉగ్రవాదుల కన్నా ఘోరంగా గో ప్రేమికులపై పోలీసులు వ్యవహరించిన తీరు విచారకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడి జరుగుతుంటే ఒక్క దళిత సంఘం కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు. మైలార్ దేవుపల్లి దళిత బస్తీలను ఖాళీ చేయించి, ఆ ప్రాంతంలో అక్రమంగా వలస వచ్చిన రోహింగ్యా ముస్లింలకు స్థావరాలు ఏర్పాటు చేసేలా కుట్ర జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు కూడా హిందువులను తీవ్రంగా కలిసి వేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులందరిపై కేసులు పెట్టి లోపల వేయండి అంటూ మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హిందూ వ్యతిరేక విధానాలపై , దళిత వ్యతిరేక విధానాలపై జరుగుతున్న అనేక వ్యవహారాలన్నీ దృష్టిలో ఉంచుకొని న్యాయ పోరాటం చేస్తామని విశ్వహిందూ పరిషత్ నేతలు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా, బీసీ, మానవ హక్కుల కమిషన్ లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో పోలీసులు వ్యవహరించిన తీరుపై రాష్ట్ర హైకోర్టులో తేల్చుకుంటామన్నారు. ఏది ఏమైనప్పటికీ గో ప్రేమికులపై జరిగిన హత్యాకాండను నిరసిస్తూ.. గో హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే తొలగించాలని అన్నారు. ఈ విషయం ఇంతటితో ఆగదని, హిందూ సమాజాన్ని ఏకం చేసి గోరక్ష కోసం ముందు కదులుతామన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ పరిరక్షణ సమితి నాయకులు, ఇతర ఎస్సీ సంఘాల నాయకులు విశ్వహిందూ పరిషత్ కు, గోరక్షకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎక్కడ ఉద్యమం జరిగినా దళిత సంఘాలు విశ్వహిందూ పరిషత్ కు మద్దతుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మీమ్ బీమ్ అంటూ దళితుల పై దాడి చేస్తున్న మజిలీస్ పార్టీ గుండాల ఆగడాలను సాగనివ్వమన్నారు ముస్లింలతోనే దళితులకు ముప్పు పొంచి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ పాలనలో రజాకార్ రాజ్యాంగ నడుస్తుందా..? బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నడుస్తుందా..? అనే అనుమానం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు డాక్టర్ రావినూతల శశిధర్, రామరాజు, రమేష్, జగదీశ్వర్ ,చింతల వెంకన్న, పగుడాకుల బాలస్వామి, జస్వంత్ , అనిల్, దీపక్, ఎస్సీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మారేడు మోహన్, నాయకులు సుమన్, అరవింద్, ఉప్పల నరసింహ, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసులు, మత్య శాఖా మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్‌ని పిసిసి మాజీ కార్యదర్శి, ఎల్ బి నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ బంజారా హిల్స్ మినిస్టర్ క్వార్టర్స్ లోని మంత్రి నివాసం నందుమర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.